సాక్షి విజయనగరం

గురువారం । 9 । అక్టోబర్ । 2025




ముందు 'చూపు' అవసరం

మానవ శరీరంలో అతి ముఖ్యమైనవి కళ్లు. కంటి చూపు కోల్పోతే జీవితం అంధకారమే. ప్రకృతి అందాలను సైతం చూడలేని పరిస్థితి. - 8లో



ఇసుక అక్రమ తవ్వకాలు

ఇసుక తరలింపులో యథేచ్ఛగా అధికార పార్టీ నాయకులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ అర్ధరాత్రి పూట ఇసుక దందా కొనసాగిస్తున్నారు. - 8లో



గిరిసీమకు దారేదీ?

ఏజెన్సీ ప్రాంతంలోని అనేక గిరిజన గ్రామాలకు నేటికీ కనీస రహదారి సౌకర్యం కలగానే మిగిలిపోయింది. - 8లో

న్యూస్‌రీల్

విదేశాల్లో విద్య, ఉద్యోగాలకు అవకాశాలు

విజయనగరం అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విదేశాల్లో ఉద్యోగాలు, ఉన్నత విద్యా అవకాశాలు లభిస్తున్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఖతార్‌లోని దోహా నగరంలో హోమ్ కేర్ నర్స్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21–40 ఏళ్ల వయసు కలిగి, బీఎస్సీ లేదా జీఎన్ఎం నర్సింగ్ అర్హతతో కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉన్న వారు అర్హులని తెలిపారు. అక్టోబర్ 13వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జర్మనీ దేశంలో ఫిజియోథెరపీ మరియు ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ ఉద్యోగాల కోసం కూడా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఉద్యోగాలకు బీపీటీ, ఎంపీటీ, డిప్లమా లేదా డిగ్రీ ఇన్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ అర్హత అవసరమని వివరించారు. దీనికి అక్టోబర్ 15 తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రష్యాలోని పర్వూరల్స్కి మెటలర్జికల్ కాలేజ్‌లో మెటలర్జీ కోర్సులో స్కాలర్ షిప్ ద్వారా చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. వివరాల కోసం 9492927844, 9966336206 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

11న విజయవాడలో ఎంటీఎస్ టీచర్ల విజ్ఞాపన సభ

విజయనగరం అర్బన్: 1998 డీఎస్సీ మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 4,072 మంది ఉపాధ్యాయులు ఈ నెల 11న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద విజ్ఞాపన సభను నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తీళ్ల రామారావు, మంతిన అప్పలరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం సాధించడమే ఈ సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ, పదవీ విరమణ అనంతరం కనీస పింఛన్ సదుపాయం, వయసు, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సౌకర్యవంతమైన బదిలీలు, ఆరోగ్య కార్డుల మంజూరు వంటి అంశాలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులంతా పాల్గొనాలని కోరారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆత్మహత్య



మృతుడు ముద్ద శ్రీకాంత్ (ఫైల్)

సాలూరు: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలు.. సాలూరు రేంజ్ పరిధిలో పని చేస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ముద్ద శ్రీకాంత్(43) పట్టణంలో బంగారమ్మ కాలనీలో నివాసముంటున్నారు. ఈ నెల 7వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు సేవించి.. ఉద్యోగం నిమిత్తం గుడివాడ గ్రామానికి బస్సులో వెళ్లారు. అక్కడ నీరసంగా ఉండడంతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. వెంటనే కుటుంబ సభ్యులు గజపతినగరం ఆసుపత్రికి అక్కడ నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. కాగా చికిత్స పొందుతూ బుధవారం ఆసుపత్రిలో శ్రీకాంత్ మృతి చెందారు. మృతుని స్వస్థలం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు. అప్పులు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు వల్ల జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి భార్య నాగజ్యోతి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చలో నర్సీపట్నంపై ముందస్తు నిర్బంధాలు




వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణకు నోటీసు అందజేస్తున్న పోలీసు

బలిజిపేట: చలో నర్సీపట్నం మెడికల్ కాలేజీ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల స్థాయి నాయకులు హాజరు కాకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తుగా ఆ పార్టీ నాయకుల ఇంటికి వచ్చి బెదిరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలో నర్సీపట్నం మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నందున దానికి మండల స్థాయి నుంచి నాయకులు హాజరు కాకుండా ఉండేందుకు పోలీస్ శాఖ అవాంతరాలు కలిగిస్తూ హుకుం జారీచేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు పార్టీ తన ఇంటికి బుధవారం రాత్రి వచ్చి పోలీస్ శాఖ ద్వారా ముందస్తు హుకుం జారీ చేశారని తెలిపారు. కార్యక్రమానికి హాజరు కాకూడదని తెలియపరిచి వెళ్లిపోయినట్టు చెప్పారు.

- అధికారులకు పండగ... ప్రజలకు దండగ
- లక్ష్యాలకు మించి వసూళ్లు
- ఒక్కో అధికారి వ్యక్తిగత లక్ష్యం ప్రకారం వసూలు
- ప్రభుత్వం ఇచ్చిన రూ.4 కోట్లు ఏమయ్యాయి?

పండగ చేసుకున్నారు..!






సాక్షి ప్రతినిధి, విజయనగరం:

పైడితల్లి అమ్మవారి పండగ అధికారుల పాలిట పండగ అయింది. సామాన్య జనం ఈ పండగను జరుపుకున్నారో.. లేదో.. కానీ అధికారులు మాత్రం అంగరంగ వైభవంగా సెలబ్రేట్ చేసుకున్నారు. గతంలో ఎన్నడూ లేనిది ఈసారి చందాల దండుకొని పండగ చేద్దాం అనే నిర్ణయానికి ప్రభుత్వ జిల్లా యంత్రాంగం రావడంతో ఇది నిజంగానే వివిధ శాఖల అధికారుల పాలిట పండగలాంటి వార్త అయింది. దీంతో శాఖల వారీగా జిల్లా అధికారులు ఫిక్స్ చేసిన టార్గెట్లు ఒకటి కాగా.. మండలాలు.. డివిజన్లో ఆయా అధికారులు వ్యక్తిగతంగా ఆ టార్గెట్లను పెంచుకొని మరింత దండుకొని పండగ చేసుకున్నారు. ఎంత దండుకున్నారు అనేది ఎక్కడ లెక్క పత్రం లేదు. ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ఒక్కో మండలానికి అన్ని శాఖలు కలిపి రూ.ఐదు లక్షలు టార్గెట్ ఫిక్స్ చేయగా ఎక్సైజ్, రెవెన్యూ, ట్రాన్స్‌కో వంటి శాఖలు చెలరేగిపోయి ఇష్టానుసారం దండేసుకుని జిల్లా కేంద్రానికి కొంత పంపి మిగతాది దిగమింగారు.

ఆ పార్టీ కార్యకర్తల కోసమేనా..

పండగ మొత్తం తెలుగుదేశం కార్యకర్తల కోసమే చేసినట్టుగా ప్రజల భావించాల్సిన పరిస్థితి నెలకొంది. వీధి, వార్డు స్థాయి కార్యకర్త కూడా రాష్ట్ర స్థాయి ప్రొటోకాల్ ఉన్నట్లుగా భావిస్తూ రొమ్ము విరుచుకుంటూ గుడి పరిసరాల్లో తిరుగుతున్నా.. ఏమాత్రం పట్టించుకొని పోలీసులు సాధారణ భక్తులను మాత్రం ఈడ్చి పారేశారు. అదేమిటో... దేవుళ్లు కూడా పెద్దలు.. డబ్బున్నవాళ్లనే కరుణిస్తారు.. తప్ప పేదలను కనీసం కనికరించరు. దీంతో చాలా మంది భక్తులు బయట నుంచి అమ్మవారికి దండం పెట్టుకుని అమ్మా ఈ ఒక్క దండాన్ని కోటి దండాలుగా భావించుకో అని రిక్వెస్ట్ పెట్టుకున్నారు.

పోలీసు శాఖది ఒక ఎత్తు..



పండగలో మిగతా అన్ని శాఖలది ఒక ఎత్తు అయితే.. ఒక్క పోలీసు వాళ్లది ఇంకో ఎత్తు. లాడ్జిలు, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల నుంచి దండుకోవడమే కాకుండా తొలేళ్ల నాటి నుంచి సినిమా చివరి వరకు పోలీసులు చేసిన ఓవర్ యాక్షన్ అంతా ఇంతా కాదు. పాతికేళ్లగా సిరిమానును చూస్తున్నాం.. గతంలో ఎన్నడూ ఇంత ఓవర్ యాక్షన్ లేదు అని విజయనగరానికి చెందిన ప్రతి వ్యక్తి అనుకునేంత గొప్పగా నటించిన పోలీసులు సెలబ్రిటీల సేవలో తరించారు. ఇక ఎండోమెంట్ వాళ్లు ఉన్నా.. లేనట్లే. సాధారణ జనం ఉన్న క్యూ లైన్‌లో భక్తులు గుక్కెడి నీటి కోసం అలమటించిపోతున్నా సరే ఆ లైన్ అలాగే ఉండిపోగా ముందు గేటు నుంచి, వెనుక గేటు నుంచి పొలిటికల్ సెలబ్రిటీలు దిలాసాగా గర్భగుడిలోకి వెళ్లి దర్శనం చేసుకుని ఫొటోలకు ఫోజులిస్తూ వచ్చారు.

రూ.4కోట్లు ఏమయ్యాయి!



ఇదిలా ఉండగా పైడితల్లి **అమ్మవారి** పండగకు రాష్ట్ర ప్రభుత్వం **నుంచి ఏకం**గా రూ.4 కోట్లు కే**టాయించినట్టు** మంత్రి కొండపల్లి **శ్రీనివాస్** చెప్పారు. ఉత్తరాంధ్ర **సంస్కృతిని** రాష్ట్ర వ్యాప్తం చేస్తామ**ని కూడా శ్రీనివాస్** ప్రకటించారు. అయిత**ే ఆ రూ.4 కోట్లు** అనేది నిజంగా డబ్బు **వచ్చిందా.. కేవలం** ప్రకటనలతోనే సరిపె**ట్టారా.. అన్నది బ్రహ్మ** రహస్యం. రాష్ట్ర ప్ర**భుత్వం ప్రకటించిన** రూ.4 కోట్లు నిజంగా **రిలీజ్ అయిందా.. కేవలం** కంటి తుడుపు కోసం **ప్రకటన చేసి ఊరుకున్నా**రా.. అనేది తెలియడం **లేదు. ఒకవేళ ప్రభుత్వమే** గనక నిజంగా రూ.4 కోట్లు డబ్బు విడుదల చేస్తే మరి ఆ డబ్బు ఏమైనట్టు. పండగ కోసం అని చిన్న చిన్న దుకాణాలను కూడా వదలకుండా దండేసిన ఈ డబ్బు ఏమైనట్టు. అటు ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తే ఇటు చందాల ద్వారా కూడా భారీగా వసూళ్లు చేస్తే మొత్తం డబ్బుకు లెక్క ఎవరు చెబుతారు. ఇదీ విజయనగరం పౌరుడి మదిలో మెదులుతున్న ప్రశ్న. మొత్తానికి పైడితల్లి అమ్మవారి పండగ ప్రజలు ఎలా జరుపుకున్నా**రో.. తెలియదుగానీ** అధికారులు, టీడీపీ **నాయకులు మా**త్రం నిజంగానే పండగ **చేసుకున్నారు.**

గుడిని.. గుడి ప్రాంగణం మొత్తాన్ని **తమ అధీనం**లోకి తీసుకున్న పోలీ**సులు చేసిన ఓవర్** యాక్షన్ అంతా ఇంతా **కాదు. ఆఖరుకు** ఎండోమెంట్ సిబ్బంది.. **ఆలయ ఉద్యోగులను** సైతం గుళ్లోకి అనుమ**తించలేదు. మూడు జిల్లాల** బాధ్యతలు చూసే **ఎండోమెంట్ జాయింట్** కమిషనర్ వచ్చినా **కూడా.. లేదు.. మేం వం**పం.. మీరెళ్లి సీఐ గారికి **చెప్పుకోండి.. ఆయన** చెబితే తప్ప లోనికి **వదిలేది లేదని చెప్పేశారు.** ఇక రెవెన్యూ.. మున్సిపల్ అధికారులను కూడా పోలీసులు పూచిక పుల్లల్లా చూసారు. పేనుకు పెత్తనం ఇస్తే బుర్ర మొత్తం గొరిగిపెట్టినట్టు కాస్త భద్రత.. తోపులాటలు లేకుండా చూడండయ్యా అని పోలీసులకు డ్యూటీలు వేస్తే వాళ్ల జనాన్ని.. ఇతర శాఖల అధికారుల మీద కూడా రుబాబు చేయడం చూసి అందరూ విస్తుపోయారు.

అక్టోబర్ 8 నుంచి సదరం శిబిరాలు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: దివ్యాంగుల పెన్షన్ల పునర్ మూల్యాంకనలో భాగంగా అప్పీలు చేసిన లబ్ధిదారులకు తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అక్టోబర్ 8 నుంచి సదరం శిబిరాలు ప్రారంభమవుతాయని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సూపర్ జీఎస్టీ క్యాంపెయిన్, ఈ – క్రాప్ నమోదు, సదరం క్యాంపుల తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాల నిర్వహణకు వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటికే షెడ్యూల్ ఖరారు చేసిందని పేర్కొన్నారు. ఎంపీడీవోలు తమ జీఎస్‌డబ్ల్యూఎస్ లాగిన్ల ద్వారా లబ్ధిదారులకు నోటీసులు అందజేయాలని ఆదేశించారు. క్యాంపుకు హాజరుకాని లబ్ధిదారులకు పెన్షన్ అందే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్లు శిబిరాలను నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని, అక్టోబర్ 8 నాటికి వైద్య బోర్డులు సిద్ధంగా ఉండాలని సూచించారు. శిబిరాలు సాఫీగా, మానవీయంగా సాగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ క్యాంపెయిన్‌ను మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ-క్రాప్ నమోదును ఈ నెల 25లోపు పూర్తి చేయాలని, వ్యవసాయ, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయం అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

విజయనగరం అర్బన్: వసతిగృహాలలో విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి హెచ్చరించారు. విద్యా శాఖ అన్ని విభాగాల అధికారులతో బుధవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వసతిగృహాలలో విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు తాగటానికి తప్పనిసరిగా వేడి నీరు మాత్రమే అందించాలన్నారు. వంట పదార్థాలను పరిశుభ్రంగా తయారు చేసి పరిసరాలను పూర్తిగా శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి రోజు విద్యార్థుల ఆరోగ్య స్థితి పరిశీలించి సిక్ రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు. ఏ ఒక్క విద్యార్థికి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీఈవో మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ ఎ.రామారావు, డీవీఈఓ తవిటినాయుడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ అధికారులు, ఐసీడీఎస్ పీడీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- పైడితల్లి ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తుల పాలిట కొంగుబంగారమైన పైడితల్లి సిరిమానోత్సవం విజయవంతంగా పూర్తయిందని.. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శిరీష బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. ఉత్సవం ప్రశాంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ



పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: విజయనగరం సబ్ డివిజన్ పరిధిలోని భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ పోలీస్‌స్టేషన్‌లను ఎస్పీ దామోదర్ బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను కొత్త చట్టాల నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన డిస్పోజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే డయల్ – 100, 112 కాల్స్ యొక్క ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని, వాటికి వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి తక్షణమే ఘటన స్థలానికి చేరుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల్లో వృద్ధులు, మహిళల పట్ల సామరస్య పూర్వకంగా, అప్యాయంగా మాట్లాడి సమస్యలకు పరిష్కారం సాధ్యమైనంత వరకు చూపాలన్నారు. స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మెరుగైన సేవలందించాలని అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీని సిబ్బంది వినియోగించుకోవాలన్నారు. గంజాయి అక్రమ రవాణ, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించే వారి పట్ల, బాల బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. తొలుత భోగాపురం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాలను సీఐ దుర్గాప్రసాద్ ఎస్పీకి దగ్గరుండి చూపించారు. అనంతరం భోగాపురం స్టేషన్‌లో తనిఖీ చేశారు. అక్కడున్న ఎస్‌హెచ్‌వో దుర్గాప్రసాద్ ఎస్పీకి క్షుణ్ణంగా సిబ్బంది వ్యవహరిస్తున్న పనితీరును వివరించారు. అనంతరం డెంకాడ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్ హెచ్‌వో సన్యాసినాయుడును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ రామకృష్ణ, ఎస్‌ఐలు పాపారావు, సూర్యకుమారి తదితరులు ఉన్నారు.

మీ కళ్లను ప్రేమించండి..!



26వ ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా మండలంలోని పెరుమాళిలో విద్యార్థులు ప్రదర్శించిన 'లవ్ యువర్ ఐస్' చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. పెరుమాళి పీహెచ్‌సీలో ఆప్తాలమిక్ అధికారిగా పని చేస్తున్న వసంతరావు ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా పెరుమాళి విద్యార్థులతో లవ్ యువర్ ఐస్ అక్షరమాలను వేయించారు. - తెర్లాం

జగన్ హయాంలో విద్య, వైద్యానికి ప్రాధాన్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం పర్యటన విజయవంతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: చంద్రబాబు సర్కారు కొత్త వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయటాన్ని వ్యతిరేకిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ఉద్యమానికి ఇచ్చిన పిలుపులో భాగంగా, గురువారం నర్సీపట్నం మెడికల్ కాలేజి పర్యటనను విజయనగరం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేస్తామని వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కోలగట్ల నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం బాగుంటేనే దేశాభివృద్ధి సాధ్యమని, దీంతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అత్యున్నత విద్య, వైద్యం అందించాలనే ధ్యేయంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు, ఇంటింటికీ వైద్యం తీసుకువచ్చారన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందించాలనే ధ్యేయంతో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి తమ హయాంలో 7 కళాశాలలను పూర్తి చేయడం జరిగిందన్నారు. నేడు చంద్రబాబు సర్కార్ 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నాలు చేస్తుందన్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎంతో ముందుచూపుతో వ్యవహరించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి తన హయాంలో పెద్దపీట వేశారన్నారు. ప్రజలు, మేధావులు, విద్యావేత్తలు చంద్రబాబు సర్కారు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను గమనిస్తున్నారని అన్నారు. చంద్రబాబు సర్కారు వైఫల్యాలను వెలుగులోకి తీసుకువస్తున్న ప్రతిపక్ష పార్టీపై కక్ష సాధింపు చర్యలు మాని ప్రజాహిత పాలనపై దృష్టి సారించాలని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఏదైనా నిరసన కార్యక్రమం చేపడితే చంద్రబాబు సర్కారు అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉందన్నారు. తామేమైనా సంఘ విద్రోహ పనులు చేస్తున్నామా, శాంతియుత నిరసనలు అడ్డుకోవడం చంద్రబాబు సర్కారుకు తగదన్నారు. ఏది ఏమైనా గురువారం నాటి జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం పర్యటన తథ్యమని, దీనికి జిల్లా పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గం నుంచి 100 కార్లతో పార్టీ శ్రేణులు వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సూర్యనారాయణరాజు, విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్, సీనియర్ కార్పొరేటర్ ఎస్వీవీ రాజేష్, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ పట్ల అలసత్వం..!

- కూటమి పాలనలో తగ్గుతున్న సేవలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో భేష్
- గత ప్రభుత్వ హయాంలో ఏడాదికి రూ.44 లక్షల ఎరువుల విక్రయాలు
- ప్రస్తుతం రూ.21 లక్షలకే పరిమితం

విజయనగరం ఫోర్ట్:

జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం(డీసీఎంఎస్) పట్ల కూటమి సర్కార్ అలసత్వం వహిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలవడంతో పాటు అభివృద్ధి పథంలో నడిచేది. అందుకు అవసరమైన సహకారాన్ని కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పట్లో అందించింది. ప్రస్తుతం డీసీఎంఎస్‌లో సేవలు, వ్యాపార లావాదేవీలు గతంలో కంటే తగ్గాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కంటే సగానికి విక్రయాలు తగ్గినట్టు తెలుస్తుంది.

2014-18 టీడీపీ హయాంలో నష్టాల్లోకి డీసీఎంఎస్

టీడీపీ 2014 – 18 అధికారంలో ఉన్న సమయంలో కూడా డీసీఎంఎస్‌ను పట్టించుకోకపోవడం వల్ల నష్టాల్లోకి వెళ్లింది. డీసీఎంఎస్ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలుగాని, వ్యాపార లావాదేవీలు పెద్దగా చేయకపోవడం అప్పట్లో సంస్థకు నష్టాలు తెచ్చిపెట్టాయి. 2017-18 సంవత్సరంలో రూ.1.51 కోట్లు వ్యాపారం జరిగింది. ఇందుకుగాను స్థూల ఆదాయం రూ.4.75 లక్షలు వచ్చింది. నికర ఆదాయం (లాభం) రాలేదు. రూ.2.47 లక్షలు నష్టం వచ్చింది. అదే విధంగా 2018-19లో రూ.5.16 కోట్లు వ్యాపారం చేయగా రూ.7.67 లక్షలు స్థూల ఆదాయం రాగా, నికర ఆదాయం (లాభం) కేవలం రూ.50 వేలు వచ్చింది.



డీసీఎంఎస్ కార్యాలయం

నిర్లక్ష్యంతోనే...

రైతుల సంక్షేమానికి పాటు పడతామని గొప్పలు చెబుతున్న కూటమి సర్కార్ డీసీఎంఎస్ పట్ల నిర్లక్ష్యం వహిస్తుందనే విమర్శలు ఉన్నాయి. అందువల్ల వ్యాపార లావాదేవీలు తగ్గాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో డీసీఎంఎస్ రైతులకు అండగా ఉంటూ విత్తనాలు, ఎరువులు వంటి ఎన్నో రకాలు సేవలు అందించేది.

ప్రస్తుతం తగ్గిన వ్యాపార లావాదేవీలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుతం వ్యాపార లావాదేవీలు తగ్గాయి. 2022 – 23లో రూ.44 లక్షల ఎరువులు విక్రయాలు జరిగాయి. 2025 – 26 లో రూ.21 లక్షల మాత్రమే ఎరువుల విక్రయాలు జరిగాయి. విత్తనాలకు సంబంధించి 2022 – 23 లో రూ.12 లక్షల విలువైన విక్రయాలు జరిగితే ప్రస్తుతం రూ.1.31 లక్షల విక్రయాలు మాత్రమే జరిగాయి.

2022 నుంచి 2025 వరకు జరిగిన విత్తనాలు, ఎరువుల విక్రయాల వివరాలు

సంవత్సరం	ఎరువులు (లక్షల్లో..)	విత్తనాలు (లక్షల్లో..)
2022-23	రూ.44.36	రూ.12.11
2023-24	రూ.30.84	రూ.24.06
2024-25	రూ.5.99	రూ.18.84
2025-26	రూ.21.50	రూ.1.31

విక్రయాల పెంపునకు చర్యలు

డీసీఎంఎస్ ద్వారా 2025 – 26 సంవత్సరంలో రూ.21.50 లక్షల విలువైన ఎరువులు, రూ.1.31 లక్షల విలువైన విత్తనాలు విక్రయాలు జరిగాయి. విక్రయాలు మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– సాయికుమార్, బిజినెస్ మేనేజర్, డీసీఎంఎస్

క్లుప్తంగా

గాంధీ విగ్రహాన్ని భద్రపరిచిన పాఠశాల సిబ్బంది



గాంధీ విగ్రహాన్ని గదిలో పెడుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

గంట్యాడ: మండలంలోని చినమానాపురం గ్రామంలో గల ఎంపీపీ పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని నేలపై పడేశారన్న అంశంపై సాక్షిలో 'మహాత్మా మన్నించు'..! శీర్షికన కథనం వెలువడగా పాఠశాల సిబ్బంది స్పందించారు. ఈ మేరకు గాంధీజీ విగ్రహాన్ని నేలపై నుంచి తీసి గదిలో భద్రపరిచారు.

అంగన్‌వాడీల ఖాతాల్లో జీతాలు జమ


అంగన్‌వాడీల ఆకలికేకలు..!

సాక్షిలో వచ్చిన కథనం

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, ఆయాలకు జీతాలు అందక అవస్థలు పడుతున్న అంశంపై ఈనెల 5వతేదిన అంగన్‌వాడీల ఆకలికేకలు..! శీర్షికన ప్రచురించిన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల బ్యాంకు ఖాతాల్లో గురువారం జీతాలు జమ చేశారు.

రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక



రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో పీడీలు

రాజాం: మండల పరిధి పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.పద్మావతి బుధవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న పూజిత అండర్–19 జట్టుకు, 9వ తరగతి చదువుతున్న యోషిని అండర్–17 జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో వారి ప్రతిభను గుర్తించి ఎంపిక చేశారన్నారు. వారి ఎంపికపట్ల వ్యాయామ ఉపాధ్యాయులు సంతోషి, త్రినాథరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఒకరోజు ఆర్టీసీ ఆదాయం రూ.6.44లక్షలు



జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు

పార్వతీపురం టౌన్: ఈనెల 7వతేదీన విజయనగరంలో జరిగిన పైడిమాంబ సిరిమాను ఉత్సవాలకు జిల్లా నుంచి వేసిన ప్రత్యేక బస్సుల ద్వారా ఒక్క రోజులో సుమారు రూ.6.44, 285 ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పార్వతీపురం డిపో నుంచి 11, పాలకొండ డిపో నుంచి 11, సాలూరు డిపో నుంచి 13 కలిపి మొత్తం 35 ప్రత్యేక బస్సులు పార్వతీపురం, విజయనగరం మధ్య ప్రయాణించాయన్నారు. అధిక సంఖ్యలో ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారని చెప్పారు. అలాగే ప్రయాణికులు వివాహాది శుభకార్యాలు, తీర్థయాత్రలకు ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోవచ్చని ఆయన సూచించారు.

రైళ్లలో చోరీ నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చేసిన జీఆర్పీఎస్సై బాలాజీరావు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: రైలులో ప్రయాణం చేసే వారినే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడే నిందితుడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు జీఆర్పీ ఎస్సై బాలాజీరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం కొండతామరాపల్లికి చెందిన కోన గౌరీశంకర్(43) రైలు ప్రయాణికులే టార్గెట్‌గా దొంగతనాలు చేసేవాడు. ఆకస్మిక తనిఖీలు చేపడుతున్న జీఆర్పీ సిబ్బంది విజయనగరం రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న గౌరీశంకర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చిట్టా మొత్తం చెప్పాడు. దీనిపై విచారణ చేసిన జీఆర్పీ సిబ్బంది గౌరీశంకర్ నుంచి రూ.లక్ష నగదు, 40 గ్రాముల గోల్డ్,1 0వేల విలువ గల మొబైల్ ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ నిమిత్తం విశాఖ రైల్వే కోర్టులో ప్రవేశ పెట్టినట్లు ఎస్సై బాలాజీరావు చెప్పారు.

ముందు–చూపు అవసరం

- కళ్లను పరిరక్షించుకోవాలి
- కంటిచూపు లేకపోతే జీవితం అంధకారమే
- నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం



రోగిని పరీక్షిస్తున్న కంటి వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మానవ శరీరంలో అతి ముఖ్యమైనవి కళ్లు. కంటి చూపు కోల్పోతే జీవితం అంధకారమే. ప్రకృతి అందాలను సైతం చూడలేని పరిస్థితి. అందువల్ల నేత్రాల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా అనేకమంది కంటి సమస్యలతో బాధపడుతున్నారు. పిల్లల దగ్గర నుంచి పెద్దవారి వరకు వివిధ రకాల కంటి సమస్యల బారిన పడుతున్నారు. మొబైల్ ఫోన్లు అధికంగా చూడడం వల్ల చాలా మందికి దృష్టి లోపం సమస్య వస్తోంది. ప్రపంచంలో ప్రతి ఒక సెకెనుకు ఒక వ్యక్తి దృష్టి కోల్పోతున్నాడు. వివిధ కారణాలతో ప్రతి ఒక నిమిషానికి ఒక చిన్నారి దృష్టి కోల్పోతున్నాడు. 2022వ సంవత్సరంలో నిర్వహించిన సర్వే అధారంగా భారత దేశంలో 49 లక్షల మంది అంధత్వంతో బాధపడుతున్నారు. అదేవిధంగా 3.50కోట్ల మంది దృష్టి లోపంతో బాధపడుతున్నారు. వారిలో 80 శాతం మంది సకాలంలో నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా దృష్టి లోపాన్ని నివారించగలిగారు. ఒక వ్యక్తి అంధత్వం బారిన పడడం వల్ల తలసరి స్థూల జాతీయ ఆదాయం రూ.1,70, 624 నష్టం వాటిల్లుతుందని అంచనా వేస్తున్నారు.

కంటిసమస్యల పట్ల నిర్లక్ష్యం కూడదు

కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయకూడదు. చాలా మంది కంటి సమస్యలకు పసర మందులు, నాటు వైద్యులను ఆశ్రయిస్తుంటారు. దీని వల్ల చూపు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుంది. కంటి సమస్యలు వచ్చినప్పుడు దగ్గరలో ఉన్న కంటి వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. అదేవిధంగా కంటి సమస్యలకు సొంత వైద్యం చేయకూడదు.

కంటి వెలుగు ద్వారా ఎంతో మందికి చూపు

కంటి ప్రాధాన్యతను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఎంతో మందిని అంధత్వం బారిన పడకుండా సకాలంలో కంటి పరీక్షలు నిర్వహించి వారికి చూపును ప్రసాదించింది. కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి చేయించింది. అదేవిధంగా కంటి అద్దాలు అవసరమైన వారికి కంటి అద్దాలు కూడా అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంటి వెలుగు కార్యక్రమానికి మంగళం పాడేసింది.

2,92,462 మంది విద్యార్థులకు తొలివిడతలో పరీక్షలు

డా.వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా తొలివిడతలో 3357 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 2,92,462 మంది విద్యార్థులకు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. రెండోవిడతలో13,109 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 3844 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి కంటి అద్దాలు అందించారు. మెల్ల కన్ను శస్త్రచికిత్సలు 18 మందికి, కంటి శుక్లం శస్త్రచికిత్సలు ఐదుగురికి, రెప్పవాలడం శస్త్రచికిత్సలు 20 మందికి నిర్వహించారు. కంటివెలుగు మూడో విడతలో1, 79, 890 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 28, 213 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరం కాగా చేశారు. 43,938 మంది అవ్వాతాతలకు కళ్లజోళ్లు అందించారు.

కంటికి గాయాలైతే వైద్యుడిని సంప్రదించాలి



కంటి గాయాలైనప్పుడు వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. ప్రతి రోజూ ఆహారంలో ఆకుపచ్చని ఆకుకూరలు, కూరగాయలతో ఉన్న ఆహారం తీసుకోవాలి. పిల్లల్లో మెల్లకన్ను, కంటి రెప్ప వాలినట్లు ఉంటే కంటి వైద్యుడిని సంప్రదించాలి. అవసరం మేరకు మాత్రమే చిన్నారులకు టీవీ, మొబైల్, లాప్‌టాప్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వాలి.

కె.త్రినాథరావు,
జిల్లా అంధత్వ నివారణ శాఖ అధికారి

రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్ల సత్తా

- సాఫ్ట్‌బాల్‌లో బాలురు, బాలికలకు ప్రథమస్థానం



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా బాలికల జట్టు



జిల్లా బాలుర జట్టు

తెర్లాం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలుర, బాలికల జట్లు సత్తా చాటాయి. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో జిల్లాకు చెందిన బాలుర, బాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. అండర్–14 సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీలు విశాఖపట్నం జిల్లా గొలుగుగొండ మండలం కృష్ణదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 4 నుంచి జరిగాయి. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన బాలురు, బాలికల జట్లు పాల్గొని మొదటి నుంచి మంచి ప్రతిభ కనబరచిన జిల్లా జట్లు ఫైనల్ పోటీలకు చేరాయి. ఫైనల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలురు జట్టు గుంటూరు జిల్లా జట్టుతో పోటీపడి విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే జిల్లాకు చెందిన బాలికల జట్టు చిత్తూరు జిల్లా జట్టుతో ఫైనల్ పోటీలో తలపడింది. ఈ పోటీల్లో విజయనగరం బాలికల జట్టు విజయం సాధించి ప్రథమస్థానాన్ని సొంతం చేసుకుంది. జిల్లాకు చెందిన రెండు జట్లు అత్యుత్తమ ఆటతీరును కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని సంపాదించి వ్యక్తిగత గోల్డ్ మెడల్స్‌తోపాటు షీల్డ్‌లను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇరుజట్ల క్రీడాకారులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు పీడీలు, పీఈటీలు, కోచ్‌లు అభినందించారు. రానున్న మరిన్ని పోటీల్లో బాగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామానికి సమీపంలో గల పెట్రోల్ బంకు దరి బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న బైక్‌ను విజయనగరం నుంచి జక్కువ వెళ్తున్న అర్టీసీ పల్లెవెలుగు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన వ్యక్తి తనది ఎస్.కోట అని చెప్పి కోమాలోకి వెళ్లిపోవడంతో తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేష్ తెలియజేశారు. తీవ్ర గాయాలైన వ్యక్తిని జిల్లా కేంద్రంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

కారు ఢీకొని మరో వ్యక్తికి..

బొండపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. . పార్వతీపురం నుంచి బొండపల్లి మండలంలోని బి.రాజేరు గ్రామానికి పైల ఈశ్వర్రావు తన బైక్‌పై భార్య, ఇద్దరు కుమార్తెలతో వస్తుండగా విజయనగరం నుంచి గజపతినగరం వస్తున్న కారు ఢీకొనడంతో బైక్ నడుపుతున్న ఈశ్వరరావుకు గాయాలయ్యాయి. గాయపడిన ఈశ్వర్రావును గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

నదిలో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహం వెలికితీస్తున్న గజ ఈతగాళ్లు

వంగర: మండల పరిధి రుషింగి వంతెన పై నుంచి నాగావళి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన కళ్లేపల్లి జగదీష్ మృతదేహం బుధవారం లభ్యమైంది. ఈ నెల 7వ తేదీన గరుగుబిల్లి మండలం రావివలస వద్ద చేపల వ్యాపారం ముగించుకుని అదే మండలం మగ్గూరు గ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలో భార్యాభర్తల మధ్య తగాదా రావడంతో జగదీష్ వంతెనపై నుంచి దూకేసిన విషయం పాఠకులకు విదితమే. స్థానిక హెచ్‌సీ దూసి రాములు ఆధ్వర్యంలో పోలీసులు, గజ ఈతగాళ్లు రుషింగి, తలగాం, శివ్వాం తదితర ప్రాంతాల వద్ద నాగావళి నదీతీరంలో గాలింపు చేపట్టారు. చివరికి వీరఘట్టం మండలం మొట్ట–వంగర మండలం సంగాం గ్రామాల సమీపంలో నాగావళి నదిలో మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలిస్తున్నట్లు హెచ్‌సీ దూసి రాములు తెలిపారు.

వీఎల్ఎస్ఐ కిట్‌ల విరాళం



జేఎన్‌టీయూ జీవీ ప్రొఫెసర్లకు వీఎల్ఎస్ఐ కిట్‌లు అందజేస్తున్న డ్రీమ్ చిప్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు

విజయనగరం రూరల్: స్థానిక జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి, సింథటిక్ ప్రొఫెసర్ టెక్నాలజీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా అగ్రగామిగా ఉన్న డ్రీమ్ చిప్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నాలుగు వీఎల్ఎస్ఐ డిజైన్ కిట్లు విరాళంగా అందించింది. ఈ సందర్భంగా డ్రీమ్ చిప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి బులుసు గోపీకుమార్ బుధవారం మాట్లాడుతూ ఈ కిట్‌లు ఎఫ్‌పీజీఏ ఆధారిత చిప్ డిజైన్, పరిశీలన కార్యకలాపాలకు అవసరమైన సాంకేతిక మద్దతుతో రూపొందించినట్లు తెలిపారు. అలాగే ఎంబెడెడ్ ఏఐ చిప్ డిజైన్, కన్జ్యూమర్ టెక్నాలజీ చిప్ డిజైన్ ఇండస్ట్రియల్ కంట్రోల్ చిప్ డిజైన్, డ్రోన్ చిప్ డిజైన్, మెడికల్ టెక్ చిప్ డిజైన్, ఆటోమోటివ్ చిప్ డిజైన్, ఫిన్‌టెక్ చిప్ డిజైన్ వంటి అనేక పరిశ్రమల్లో ఉపయోగపడతాయని ఆయన చెప్పారు. ఈ కిట్‌లకు డ్రీమ్ చిప్ ఎలక్ట్రానిక్స్ సంస్థ నుంచి ఈ మెయిల్ సపోర్ట్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ వీఎల్ఎస్ఐ డిజైన్ కిట్లు తమిళనాడులోని చెన్నైలో రూపొందించబడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం ఆంధ్ర మెడ్ టెక్ జోన్‌లో డ్రీమ్ చిప్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో తయారుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్రీమ్ చిప్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి బులుసు మురళి, జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ బబులు, ఈసీ విభాగాధిపతి ప్రొఫెసర్ కేసీబీ రావు, ఇతర బోధకులు పాల్గొన్నారు.

జేసీబీతో ఇసుక అక్రమ తవ్వకాలు



అలజంగి కాలనీలో వేసిన ఇసుక

బొబ్బిలిరూరల్: ఇసుక తరలింపులో యథేచ్ఛగా అధికార పార్టీ నాయకులు చెలరేగిపోతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ అర్ధరాత్రిపూట ఇసుక దందా కొనసాగిస్తున్నారు.విషయం తెలిసినా అధికార పార్టీ నాయకులు కావడంతో అధినేత ఆగ్రహానికి గురికాకూడదని అధికారులు సైతం మౌన ముద్ర వహిస్తున్నారు. దీంతో ఏకంగా నదిలో జేసీబీని వినియోగించి పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. బొబ్బిలి మండలంలోని అలజంగి గ్రామం వద్ద వేగావతి నదిలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జేసీబీతో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో తరలించారు. దాదాపు 80 ఇసుక ట్రాక్టర్ల లోడ్ల ఇసుకను జేసీబీతో తవ్వి తీసి కొంతమేర పట్టణంలోని కాంట్రాక్టర్లకు అమ్ముకోగా మరికొన్ని ఇసుక లోడ్లు గ్రామంలోని కొత్తకాలనీలో రహదారిపై వేశారు. అడిగితే గ్రామంలోని రహదారులేకనని నమ్మించే ప్రయత్నం చేయగా గ్రామంలో కొంతమంది ప్రతిరోజూ అలజంగిలో జరుగుతున్న ఇసుక దందాపై ఇతరులకో నీతి,అధికార పార్టీనాయకులకో నీతి అంటూ చర్చించుకుంటున్నారు.

పరిశ్రమలకు రాత్రిపూట తరలింపు

ఇదిలా ఉండగా గ్రోత్‌సెంటర్‌లో ఫెర్రోపరిశ్రమలకు సైతం రాత్రి వేళల్లో ఇసుక అక్ర తరలింపు జరుగుతోంది. స్టాక్ పాయింట్ నుంచి తీసుకోవాల్సిన ఇసుకను ట్రాక్టర్ల యజమానులను సంప్రదించి పెంట వద్ద వేగావతి నది నుంచి రాత్రి 11 గంటలనుంచి తెల్లావార్లూ ఇసుక అక్రమరవాణా జరుగుతోందని, రోడ్లు కొట్టుకు పోతున్నాయని సాక్షాత్తు ఆయా గ్రామాల ప్రజలు తహసీల్దార్ ముందు వాపోయారు. అయినా అధినేత ఆంక్షలతో చూసీచూడనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు.

నా దృష్టికి రాలేదు

అలజంగి గ్రామంలోని వేగావతి నదిలో మంగళవారం రాత్రి ఇసుక తవ్వకాలపై తహసీల్దార్ ఎం.శ్రీను వద్ద ప్రస్తావించగా తమ దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి చర్యలు చేపడతామని చెప్పుకొచ్చారు.

ఇతర సమస్యలతో మరణాలు

- డీఎంహెచ్‌ఓ డా. ఎస్.భాస్కరరావు



డీఎంహెచ్ఓ డా.ఎస్.భాస్కరరావు

పార్వతీపురంటౌన్: జిల్లాలో నిమ్మక సుమన్, నిమ్మక ప్రశాంత్‌లు పచ్చకామెర్ల వల్ల కాదని ఇతర సమస్యలతో మృతి చెందారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు జిల్లా నివాసి నిమ్మక సుమన్ (23) సెప్టెంబర్ 14వ తేదీన గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు గ్రామానికి వచ్చాడన్నారు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు ఆయన గత నెల రోజులుగా నెల్లూరులో స్టోర్ కీపర్ గా పని చేస్తున్నాడని, సెప్టెంబర్ 30న ఒడిశా రాష్ట్రం లోని దుర్గపాడు జలపాతాన్ని సందర్శించి, అదే రోజు సాయంత్రం తిరిగి వచ్చాడన్నారు. అక్టోబర్ 4న జ్వరం, రెండు సార్లు విరేచనాలు, వాంతులు, పొత్తికడుపు నొప్పితో బాధపడుతూ ఉదయం 11 గంటలకు కురుపాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రాగా వైద్యుడు పరిశీలించి అక్టోబర్ 5న మధ్యాహ్నం 12 గంటల సమయంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేయడంతో చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో చేర్చిన సమయానికి రోగి స్థిరంగా,చురుగ్గా ఉన్నాడని, దురదృష్టవశాత్తు అక్టోబర్ 6న అర్ధరాత్రి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ఎన్సెఫలోపతి కారణంగా మరణించాడని చెప్పారు. అదేవిధంగా నిమ్మక ప్రశాంత్ (31) జియ్యమ్మవలస మండలం చినదోడిజ గ్రామంలో అక్టోబర్ 5న తీవ్రమైన కడుపునొప్పితో సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకున్న అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నారు. అయితే అప్పటికే దీర్ఘ కాలంగా మద్యపానం అలవాటు వల్ల మల్టిపుల్ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ కావడంతో మయోకార్డియల్ ఇన్ఫెక్షన్‌తో అక్టోబర్ 5 తేదీన రాత్రి మృతి చెందినట్లు వివరించారు. ఈ మరణాలు ఇతర సమస్యల కారణంగా జరిగినవే తప్ప , పచ్చకామెర్ల వల్ల కాదని స్పష్టం చేశారు.

గిరిసీమకు దారేదీ?

- రహదారి సౌకర్యం లేని 226 గిరిజన గ్రామాలు
- బాహ్య ప్రపంచంతో తెగిపోయిన సంబంధం
- నిత్యం నరకం చూస్తున్న ప్రజానీకం
- వైద్యం అవసరమైతే డోలీలే అంబులెన్సులు





రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాల్లో ఇటీవల సర్వే నిర్వహించిన సచివాలయం ఇంజినీరింగ్ సిబ్బంది

పార్వతీపురం రూరల్: స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, ఆధునిక ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతున్నా, ఏజెన్సీ ప్రాంతంలోని అనేక గిరిజన గ్రామాలకు నేటికీ కనీస రహదారి సౌకర్యం కలగానే మిగిలిపోయింది. పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఏకంగా 226 గ్రామాలకు సరైన దారి లేక అక్కడి ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. వాగులు, వంకలు, కొండలు, గుట్టలే వారికి శ్రీరామరక్షగా మారాయి. ప్రభుత్వ పాలకుల హామీలు నీటి మీద రాతల్లా మిగులుతున్నాయే తప్ప, వారి తలరాతలు మాత్రం మారడం లేదని గిరిజనం కన్నీటి పర్యంతమవుతోంది.

అడుగు బయటపెడితే అష్టకష్టాలు

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో రహదారుల దుస్థితికి అద్దం పట్టే గ్రామాలు కోకొల్లలు. ప్రధానంగా 63.30 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించాల్సి ఉన్నప్పటికీ, పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరీ ముఖ్యంగా, 52 గ్రామాలు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నాయంటే, వాటికి కనీసం కాలిబాట కూడా లేకపోవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. వర్షాకాలం వస్తే ఆ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. అత్యవసర వైద్యం అవసరమైతే డోలీలే వారికి అంబులెన్సులు. చదువుకోవాలన్నా, నిత్యావసరాలు తెచ్చుకోవాలన్నా, కిలోమీటర్ల కొద్దీ బురద, రాళ్ల మధ్య ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం చేయాల్సిందే.

గ్రామాల వారీగా గణాంకాలు

అధికారిక లెక్కల ప్రకారం, కురుపాం, మక్కువ, జియ్యమ్మవలస, పాచిపెంట, సాలూరు మండలాల పరిధిలో 25 గ్రామాలకు రోడ్లు లేవు. సాలూరు మండలంలోని గంజాయిభద్ర, నేరెళ్లవలస, కొదమ, సారిక వంటి పంచాయతీలలోని 14 గ్రామాలకు రహదారి నిర్మాణం అత్యవసరం. పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, పార్వతీపురం వంటి అనేక మండలాల్లోని గిరిజన గ్రామాలది కూడా ఇదే దుస్థితి. ప్రతి ఏటా అధికారులు సర్వేలు చేయడం, ప్రతిపాదనలు పంపడం సాధారణ ప్రక్రియగా మారిందే తప్ప, ఆచరణలో పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. నిధుల కొరతో, అటవీ అనుమతుల జాప్యమో కారణం ఏదైనా, శిక్ష అనుభవిస్తున్నది మాత్రం అమాయక గిరిజనులు. ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి ఆదేశాలతో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ దఫా అయినా పనులు చేస్తారా? లేదా ఎప్పటిలాగానే చేసిన సర్వే లెక్కలు కాగితాలకే పరిమితమవుతాయో వేచి చూడాల్సిన పరిస్థితి.

పాలకుల ప్రగల్భాలు..

సంక్షేమ రాజ్యమని, సుపరిపాలన అందిస్తున్నామని ఊదరగొట్టే పాలకుల మాటలకు, గిరిజన ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితికి మధ్య ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంది. అధికారం చేపట్టి ఏడాదిన్నర కాలం గడుస్తున్నా, జిల్లాలోని 226 ఆదివాసీ గ్రామాలకు కనీసం కాలిబాటను కూడా నిర్మించలేని ఈ ప్రభుత్వానికి అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది? అంటూ గిరిజన సంఘాలు నిలదీస్తున్నాయి. గిరిజనుల బతుకులు కన్నీటి సుడుల్లో చిక్కుకుంటే, పాలకులు మాత్రం ప్రగల్భాలు పలుకుతూ కాలం వెళ్లదీస్తున్నారని మండిపడుతున్నారు.

గిరిజనుల గోడు పట్టదా?



ఎవరికైనా జ్వరం వచ్చినా, గర్భిణికి పురిటి నొప్పులొచ్చినా ప్రాణాల మీద ఆశ వదులుకుని డోలీలో ప్రయాణించాల్సిందే. వర్షాకాలం వస్తే మరింత దారుణమైన పరిస్థితి. గిరిజనులు పిల్లల చదువులు, అరకొర అందించే రేషన్ అన్నీ ఆగిపోతాయి. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చిన కుటమి నాయకులు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత చూసే హామీలు అమలు చేసిన దాఖలాలు లేవు. ఇటీవల కలక్టర్ ఆదేశంతో సర్వే చేసిన గిరిజన గ్రామాలకు తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నాం.

– పాలక రంజిత్ కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధన కార్యదర్శి

చెట్టు మీద పడి పోడు రైతు మృతి



రామారావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పార్వతీపురం రూరల్ /కొమరాడ: కొమరాడ మండలంలో బుధవారం వ్యవసాయ పనులకు వెళ్తున్న ఓ రైతు మీద మామిడి చెట్టు పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గూడాతలేసు పంచాయతీ పరిధి తీలేసు గ్రామానికి చెందిన పువ్వల రామారావు(47) కొండపోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. రోజులాగానే బుధవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో ఒక్కసారిగా పెనుగాలి వీయడంతో ఓ భారీ మామిడి చెట్టు రామారావుపై పడింది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలిపోగా గమనించిన స్థానికులు హుటాహుటిన 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, రామారావు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా, డిగ్రీ పూర్తి చేసిన చిన్న కుమార్తె తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. రామారావు ఆకస్మిక మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చికెన్ బ్రాయిలర్	లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
	₹147	₹264	₹274